సంపుటి : 05 | సంచిక : 95
పేజీలు : 04 | వెల: రూ.5/-
గురువారం
ఏప్రిల్ 02, 2026
# వరంగల్ వాయిస్
Evening Daily
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## సామాజిక సమరయోధుడు సర్వాయి పాపన్న గౌడ్


4లో..

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కలెక్టరేట్‌లో పాపన్న గౌడ్ కు ఘన నివాళి



2లో..

- గ్రామ సభల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు
- ఉమ్మడి జిల్లాలో జోరుగా 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'
- అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశం

ప్రజల కష్టాలు తీర్చడమే పరమావధిగా, సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారుల ముంగిటకు చేర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణతో గ్రామ గ్రామాన అభివృద్ధి జడివాన కురిపించేందుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు నేరుగా క్షేత్రస్థాయికి చేరుకున్నారు. గురువారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభలు ప్రజల విన్నపాలతో కిక్కిరిశాయి. అర్హులైన లబ్ధిదారుల జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా పారదర్శకంగా ఎంపిక చేయాలని, ప్రజలు అందించిన ప్రతి ఫిర్యాదుపై సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**వరంగల్ వాయిస్, ఉమ్మడి వరంగల్ జిల్లా :**

## శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సామాన్యులకు చేరాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- సైన్స్ సెంటర్ పునర్వైభవానికి శ్రీకారం
- కుడా చైర్మన్, కలెక్టర్‌తో కలిసి రీజనల్ సైన్స్ సెంటర్ సందర్శన
- పనిచేయని పరికరాలపై ఎమ్మెల్యే ఆగ్రహం


3లో..

## బహుజన రాజ్య స్థాపకుడు సర్వాయి పాపన్న గౌడ్


4లో..

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఘనంగా పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు

## లోక్‌సభలో రైతుల పక్షాన వరంగల్ ఎంపీ గళం

- ఇంధన ధరల భారంతో కునారిల్లుతున్న వ్యవసాయ రంగం
- డాక్టర్ కడియం కావ్య
- సాగు ఖర్చులు పెరిగి రైతుల ఆదాయం దెబ్బతింటోంది
- రైతులకు ప్రత్యేక ఇంధన సబ్సిడీ ఇవ్వాలి


3లో..


4లో..

## స్విమ్మింగ్ పూల్ ఘటనపై 'సీపీ' సీరియస్

- తల్లి, ఇద్దరు కుమార్తెల మృతిపై క్షేత్రస్థాయిలో విచారణ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్
- శాస్త్రీయ కోణంలో దర్యాప్తు చేయాలని ఆదేశం

**పెద్ద కర్మ**



స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సర చైత్ర మాస శుద్ధ షష్ఠి
తేది. 24-03-2026 మంగళవారం రోజున ఉ. 10-00 గంటలకు
మా తండ్రి గారైన

**శ్రీ పూజారి విజయ్ గారు**

పరమపదించినారు. కావున తెలుపుటకు చింతించుచున్నాము.
తేది. 3-04-2026 శుక్రవారం రోజున ఉ॥9-00 గం॥లకు
మా స్వగృహములో పెద్దకర్మ జరుపబడును.
కావున తామెల్లరు విచ్చేసి మా తండ్రి గారి ఆత్మకు
శాంతి చేకూర్చగలరని ప్రార్థన.

కార్యస్థలం : మా స్వగృహము
ఇ.నెం. 3-14/1, గ్రా॥ గట్లకానిపర్తి,
మం॥ శాయంపేట, జి॥ హనుమకొండ,
సెల్ : 9652988566

సహపంక్తి భోజనము : మ॥ 1-00 గంటలకు

ఇట్లు
భార్య : పూజారి సుజాత
కూతుర్లు : పూజారి సౌమ్యశ్రీ
పూజారి సాహితి
తల్లి దండ్రులు : పూజారి సాంబయ్య-సాంబలక్ష్మి
-కుటుంబ సభ్యులు

## గ్రామ అభివృద్ధికి గ్రామ సభలు



**వరంగల్ వాయిస్, దోర్నకల్:** ప్రజాపాలన – ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా గురువారం దోర్నకల్ మండలంలోని చాంప్లతండా గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభను నిర్వహించారు. గ్రామ కార్యదర్శి వెంకట్రామణ అధ్యక్షతన పంచాయతీ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన గ్రామసభకు సర్పంచ్ బానోతు రంగమ్మ,స్పెషల్ ఆఫీసర్ పార్థసారథి, వివిధ వార్డు మెంబర్లు, ఐకేపి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కిషోర్ మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో పురోగతి సాధించామన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహాలు అందిస్తామన్నారు. గృహ జ్యోతి పథకం ద్వారా ఇప్పటి వరకు దాదాపు 209 మంది లబ్ధిదారులకు 22 లక్షల రూపాయల లబ్ధిని పొందారన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతులకు లాభం చేకూరిందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకోవచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

## గడప గడపకు సంక్షేమ పథకాలు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ / మద్దులపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మద్దులపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా గురువారం గ్రామసభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎల్సుల సరిత అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సభలో ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పి.స్వాతి, వార్డు సభ్యులు దేవిక, శ్రావణి, మన్నక్క, తేజస్విని పాల్గొన్నారు. వీరితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు సదయ్య, జీపీఓ. రఘు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, ఆశా వర్కర్ స్వరూప, అంగన్వాడీ టీచర్లు శ్రీకళ, వీవోఏ మొండయ్య, గ్రామ ప్రజలు హాజరయ్యారు.

# ప్రజల ముంగిటకే పాలన.. సంక్షేమమే లక్ష్యం

- మంత్రులు కొండా సురేఖ, సీతక్క
- గ్రామ సభల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,
- నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు
- ఉమ్మడి జిల్లాలో జోరుగా 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'
- అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశం



**వరంగల్ వాయిస్, ఉమ్మడి వరంగల్ జిల్లా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గురువారం జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు పాల్గొని ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించారు.

### సమస్యల త్వరితగతిన పరిష్కారం: మంత్రి కొండా సురేఖ

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీలో నిర్వహించిన సభకు మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల చెంతకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో



పెండింగ్లో ఉన్న సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వరంగల్ దేశాయిపేట 12వ వార్డు సభలో మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్య శారదతో కలిసి మంత్రి పాల్గొన్నారు.

### ములుగులో మంత్రి సీతక్క పర్యటన

ములుగు జిల్లా వెంకటాపూర్, చల్వాయి గ్రామాల్లో నిర్వహించిన సభల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పంపిన సందేశాన్ని కలెక్టర్ దివాకర టీఎస్ ప్రజలకు వినిపించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమలు తీరును మంత్రి స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనిత రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

### అవినీతికి తావులేని పాలనే లక్ష్యం: కడియం శ్రీహరి

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జఫర్గడ్ మండలం ఉప్పుగల్, పాముసూరు గ్రామాల్లో సందర్శించారు. గత పాలకులు చేసిన అప్పుల భారం ఉన్నప్పటికీ, పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన అన్నారు. ఉప్పుగల్ గ్రామాభివృద్ధికి రూ.60 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పాముసూరుకు రెండో విడతలో 30 ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

### 99 రోజుల ప్రణాళికతో విప్లవాత్మక మార్పులు: నాయిని

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హన్మకొండ 29వ డివిజన్ వార్డు సభలో పాల్గొన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదలకు న్యాయం చేస్తున్నారని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్పాయ్, మేయర్ గుండు సుధారాణి, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పరకాలలో పండుగలా..



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా పరకాల మున్సిపాలిటీ 16వ వార్డు సభ గురువారం స్థానిక ఎఫ్.జె. గార్డెన్లో అత్యంత ఉత్సాహంగా జరిగింది. వార్డు ప్రజల భాగస్వామ్యంతో ఈ సభ ఒక పండుగ వాతావరణాన్ని తలపించింది. మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు స్వీకరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మార్గదర్శకత్వంలో అమలవుతున్న ఆరు గ్యారెంటీలు మరియు ఇతర సంక్షేమ పథకాలపై ఈ సభలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులు, ఈ ప్రజా ప్రభుత్వం కేవలం కొన్ని నెలల్లోనే చేసి చూపిస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకం అందడమే లక్ష్యంగా ఈ 99 రోజుల ప్రణాళిక సాగుతోందని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఈ సభను పర్యవేక్షించి, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ రవి, మున్సిపల్ ఏఈ రంజిత్ కుమార్, హౌసింగ్ ఏఈ సౌమ్య, ఆర్పి సునీత, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, 16వ వార్డు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అప్పయ్యపల్లిలో 'ప్రజాపాలన' సంబరం..

**వరంగల్ వాయిస్, గణపురం :** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే లక్ష్యంగా గణపురం మండలం అప్పయ్యపల్లి గ్రామ పంచాయతీలో 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' గ్రామసభ గురువారం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ ఎలుకపెల్లి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సభ ప్రారంభంలో తెలంగాణ జాతీయ గీతం మరియు జనగణమన ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు వివరించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంపై సభలో ప్రధానంగా చర్చించారు. విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ వరకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు. కుటుంబ బీమా, వెలుగు పథకం ద్వారా లబ్ధి పొందేలా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ కోరారు."ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఒక వేదికగా నిలుస్తుందని అప్పయ్యపల్లి సర్పంచ్ ఎలుకపెల్లి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, ఏపీఎం, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు హాజరై సభను విజయవంతం చేశారు.





## వేలేరు ప్రగతి పథం..

### సర్పంచ్ బిల్లా యాదగిరి

**వరంగల్ వాయిస్, వేలేరు :** హనుమకొండ జిల్లా వేలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' గ్రామసభ అత్యంత ఉత్సాహంగా జరిగింది. గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు మండల తహసీల్దార్ (గ్రామసభ స్పెషల్ ఆఫీసర్) కోమి, మండల స్పెషల్ ఆఫీసర్ రవీందర్ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దాదాపు 650 మంది గ్రామ ప్రజలు హాజరైన ఈ సభలో ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కడియం కావ్యల ప్రత్యేక చొరవతో వేలేరు గ్రామానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయని సర్పంచ్ తెలిపారు. ఇప్పటివరకు పూర్తయిన అభివృద్ధి పనుల వివరాలను సభ ముందు ఉంచారు. భవిష్యత్తులో గ్రామంలో నెలకొన్న ఇతర మౌలిక సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, విద్యుత్ శాఖ ఏఈ కుమారస్వామి, హెల్త్ డిపార్ట్మెంట్ నవీన్, జీపీ కార్యదర్శి సంపత్ కుమార్, వార్డు సభ్యులు సంధ్య, ప్రవళిక, మౌనిక, పర్వీన్, రణధీర్ రెడ్డి, జావిద్ పాషా, లక్ష్మీనారాయణ, సంధ్య, ప్రశాంత్, సురేష్, సునీల్, గ్రామ ప్రజలుపాల్గొని సభను దిగ్విజయం చేశారు.

# లోక్‌సభలో రైతుల పక్షాన వరంగల్ ఎంపీ గళం

- ఇంధన ధరల భారంతో కునారిల్లుతున్న వ్యవసాయ రంగం
- డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ/వరంగల్ :** పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య రైతును ఆర్థికంగా కుంగదీస్తున్నాయని, వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభలో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆమె పాల్గొని, ఇంధన ధరల పెరుగుదల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గట్టిగా వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్ ఆధారిత ధరల విధానం వల్ల రైతులపై అదనపు భారం పడుతోందని ఆరోపించారు. "పంటల రవాణా, ఎరువుల సరఫరా, ట్రాక్టర్లు వంటి వ్యవసాయ యంత్రాల వినియోగం పూర్తిగా ఇంధనంపైనే ఆధారపడి ఉన్నాయి. డీజిల్ ధరలు పెరగడం వల్ల సాగు ఖర్చులు విపరీతంగా పెరిగి, రైతులకు వచ్చే నికర ఆదాయం తగ్గిపోతోంది" అని ఆమె వివరించారు. రైతులకు ఇంధన ధరల్లో ప్రత్యేక రాయితీలు లేదా ప్రత్యక్ష సబ్సిడీలు కల్పించాలని కేంద్రాన్ని కోరారు. ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి సమాధానమిచ్చారు. ఇంధన ధరలను అంతర్జాతీయ మార్కెట్ అనుగుణంగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలే నిర్ణయిస్తాయని ఆయన తెలిపారు. అయితే, వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు కేంద్రం గతంలో ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, ఇటీవల అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినప్పటికీ లీటరుకు రూ.10 చొప్పున సుంకాన్ని తగ్గించినట్లు వెల్లడించారు. రైతులకు మాత్రం ప్రత్యేక ఉపశమనం కలిగించడం లేదని ఎంపీ కావ్య అభిప్రాయపడ్డారు. వరంగల్ జిల్లాలో ఇంధన ధరలు స్వల్పంగా తగ్గినట్లు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో రైతు పడుతున్న వాస్తవ భారంలో మార్పు లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అన్నదాతలకు ఇంధన రాయితీలు అందించాలని ఆమె గట్టిగా కోరారు.

# బహుజన విప్లవకారుడు సర్వాయి పాపన్న

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** బహుజన రాజ్యం కోసం, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన వీర యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్టాపురం ఏకాంతం గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం పర్వతగిరి మండలంలోని వడ్లకొండ గౌడ సంఘం సొసైటీ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏకాంతం గౌడ్, పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్లకొండ గౌడ సొసైటీ అధ్యక్షులు పట్టాపురం బిక్షపతి గౌడ్, ఉపాధ్యక్షులు బండి రాజు గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుల పెద్దలు, సంఘం సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కన్నవారికి 'చట్ట' కవచం.. సంరక్షణ బిల్లు

**భా**రతీయ సంస్కృతిలో 'మాతృదేవోభవ.. పితృదేవోభవ' అనే సూక్తికి తెలంగాణ ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. కన్నవారిని అనాథలుగా వదిలేస్తున్న ప్రస్తుత స్వార్థపూరిత సమాజంలో, వారి సంరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన 'తల్లిదండ్రుల పోషణ బిల్లు' ఒక చారిత్రాత్మక సామాజిక విప్లవంగా నిలుస్తోంది. లక్షల్లో వేతనాలు అందుకుంటూ విలాసవంతమైన జీవితం గడుపుతున్న కొందరు పిల్లలు, తమను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో రోడ్డున పడేస్తున్నారు. ఈ 'సామాజిక క్యాన్సర్'ను కేవలం నీతి వాక్యాలతో నయం చేయలేమని గుర్తించిన ప్రభుత్వం, ఆర్థిక ఆంక్షల ద్వారా బాధ్యతను గుర్తు చేయనుంది. కన్నవారిని నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతం నుంచి 15శాతం కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అనారోగ్యంతో అలమటించే వృద్ధులకు ఈ ఆర్థిక సహాయం ఒక 'సంజీవిని'లా మారుతుంది. ఇది ఉంటే వృద్ధాశ్రమాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ సొంత ఊర్లోనే గౌరవంగా బతకవచ్చు. భారతదేశంలో ఇప్పటికే అస్సాం ప్రభుత్వం 'ప్రణామ్' పేరుతో ఇలాంటి చట్టాన్ని విజయవంతంగా అమలు చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఆ మోడల్‌ను మరింత పకడ్బందీగా రూపొందిస్తోంది. ఇందులో కేవలం తల్లిదండ్రులకే కాకుండా, సంరక్షణ అవసరమైన వికలాంగులైన తోబుట్టువుల బాధ్యతను కూడా చేర్చడం అభినందనీయం. ప్రతి చట్టానికి రెండు వైపులా ఫలితాలు ఉంటాయి. బలవంతంగా డబ్బులు కట్ చేయడం వల్ల తల్లిదండ్రులు, పిల్లల మధ్య దూరం పెరిగే ప్రమాదం ఉంది. కుటుంబ తగాదాల నేపథ్యంలో వచ్చే తప్పుడు ఫిర్యాదులను అరికట్టడానికి పారదర్శకమైన విచారణ వ్యవస్థ ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులపై నియంత్రణ సులభం కానీ, భారీ జీతాలు తీసుకునే ఐటీ, ప్రైవేటు రంగ ఉద్యోగులను ఈ పరిధిలోకి ఎలా తీసుకువస్తారనేది ఒక సవాలుగా మిగిలింది. చట్టాలు కేవలం భయం కోసమే కాకుండా బాధ్యతను గుర్తు చేయడానికి ఉండాలి. పాఠశాల దశ నుంచే పిల్లల్లో నైతిక విలువలు, తల్లిదండ్రుల పట్ల గౌరవం పెంచేలా విద్యాబోధన సాగాలి. తల్లిదండ్రుల సంరక్షణ అనేది ఒక 'ఆప్షన్' కాదు.. అది ప్రతి బిడ్డకు ఒక 'తప్పనిసరి బాధ్యత' అని ఈ చట్టం స్పష్టం చేస్తోంది.

వ్యాస కర్త
మార్త భిక్షపతి
సేవా రత్న నేషనల్ అవార్డు గ్రహీత
ఫోన్: 9885000293



# శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సామాన్యులకు చేరాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- సైన్స్ సెంటర్ పునర్వైభవానికి శ్రీకారం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ నగరంలోని శాస్త్ర విజ్ఞాన అభివృద్ధికి, విద్యార్థులలో వైజ్ఞానిక స్పృహ పెంపొందించేందుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నడుం బిగించారు. గురువారం హంటర్ రోడ్ జూ పార్క్ సమీపంలోని రీజనల్ సైన్స్ సెంటర్‌ను కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రం రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌లతో కలిసి ఆయన సందర్శించారు. సెంటర్‌లోని పరిస్థితులను, శాస్త్ర సాంకేతిక పరికరాల పనితీరును వారు క్షుణ్ణంగా సమీక్షించారు. సైన్స్ సెంటర్‌లో ఉన్న పలు కీలక పరికరాలు పనిచేయకపోవడం, భవన సౌకర్యాల కొరతపై ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగపడాల్సిన పరికరాలు మూలకు పడి ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వాటిని తక్షణమే మరమ్మతు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. శాస్త్ర సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సెంటర్‌ను ఆధునికీకరించడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ప్రతిపాదించిన కొత్త పరికరాలు, అదనపు సదుపాయాల ఏర్పాటుపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కుడా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, సైన్స్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం



**వరంగల్ వాయిస్, టేకుమట్ల/వెల్లంపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెల్లంపల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ శిలా శంకుస్థాపన మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. భక్తిశ్రద్ధల మధ్య జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కీర్తి రెడ్డి మాట్లాడుతూ.. వెల్లంపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం ఎంతో శుభపరిణామమని కొనియాడారు. జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో సానుకూల దృక్పథం పెరుగుతుందని, ఇది గ్రామ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బండారి సమ్మయ్య, జిల్లా నాయకుడు కూర సురేందర్ రెడ్డి, సుబ్బక్కపల్లె సర్పంచ్ బొడ్డు రాజేందర్, వెల్లంపల్లి బూత్ అధ్యక్షుడు శివ, బండపల్లి ఉపసర్పంచ్ ఆరే అశోక్, మేకల వీరారెడ్డి, బూస రాజయ్య, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా హనుమాన్ విజయోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, కాళేశ్వరం/మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో హనుమాన్ విజయోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగాయి. క్షేత్రంలోని వీర హనుమాన్ ఆలయంలో స్వామివారి విజయోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా అర్ధరాత్రి 12 గంటలకు ఆలయ అర్చకులు మాడుగుల బాపు శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అత్యంత వైభవంగా చందన అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం అర్చక బృందం శాస్త్రోక్తంగా మన్య సూక్త హవనం జరిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో భక్తి జయజయధ్వానాల మధ్య ధ్వజారోహణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ప్రత్యేక హోమం నిర్వహించి, వేద మంత్రోచ్ఛారణల మధ్య పూర్ణాహుతితో కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముగించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ మాల ధరించిన దీక్షాపరులు, స్థానిక గ్రామ ప్రజలు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయమంతా హనుమాన్ నామస్మరణతో మారుమోగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# గిరిజన విజ్ఞాన పీఠం అభివృద్ధికి కృషి

- జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ

**వరంగల్ వాయిస్, హంటర్ రోడ్డు :** తెలంగాణ సంస్కృతి, జానపద, గిరిజన సాహిత్య పరిశోధనలకు నిలయంగా ఉన్న వరంగల్ 'జానపద గిరిజన విజ్ఞాన పీఠం' అభివృద్ధికి పర్యాటక శాఖ తరపున కృషి చేస్తామని జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ తెలిపారు. గురువారం హంటర్ రోడ్డులోని పీఠాన్ని సందర్శించిన ఆయన, 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఈ సంస్థ పురోభివృద్ధికి అవసరమైన నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. శివాజీ పీఠానికి చేరుకోగా, పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న నేతృత్వంలో అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీఠం గత మూడు దశాబ్దాలుగా చేపట్టిన పరిశోధనలు, సేకరించిన అరుదైన సమాచారాన్ని శివాజీకి వివరించారు. మ్యూజియంను సందర్శించిన సందర్భంగా డాక్టర్ వెంకన్న పలు కీలక అంశాలను అధికారి దృష్టికి తీసుకెళ్లారు. గత 30 ఏళ్లుగా సేకరించిన ఆడియో, వీడియో టేపులను భవిష్యత్తు తరాల కోసం డిజిటలైజ్ చేయాలి. మ్యూజియంలో ఉన్న పూర్వీకుల అరుదైన పనిముట్లు, సంప్రదాయ వస్తువులను భద్రపరచడానికి ప్రభుత్వ సాయం కావాలి.



నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ఆవరణలో పర్యాటకుల కోసం ఓపెన్ ఎయిర్ థియేటర్, శిల్పకళా వేదికలను ఏర్పాటు చేయాలి. "ఇక్కడ పర్యాటకులను ఆకర్షించే అద్భుతమైన మ్యూజియం ఉంది. దీనిని మరింత ఆధునీకరిస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. పర్యాటక శాఖ తరపున ఈ పీఠం అభివృద్ధికి పూర్తి మద్దతు ఇస్తామని జిల్లా పర్యాటక అధికారి శివాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టూరిజం సిబ్బంది డాక్టర్ వంశీతో పాటు పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ బాసని సురేష్, డాక్టర్ చురేపల్లి రవికుమార్ పాల్గొన్నారు. ఇతర సిబ్బంది అమీర్ అలీ ఖాన్, అబ్బ గోపాల్ రెడ్డి, వీడియో గ్రాఫర్ డాక్టర్ గంప సతీష్, విజయలక్ష్మి, సునంద, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ మిత్రమా.. పూజారి విజయ్



ఎందుకు చేశావయ్యా ఈ పని ఆత్రంగా
నీవంటే స్నేహలోకంలో ఒక ప్రత్యేకం
ఎవరిపైన చూపించలేదు కోపం
చెదరని చిరుదరహాసం .
ఆత్మీయంగా పలకరించే ఆప్యాయత
మీరంటేనే ఒకరకమైనప్రేమ .
విజయ్ అంటేనే అందరివాడనే భావన
చిన్నవయస్సులో దైవభక్తి ఎక్కువ ,
మీకు హన్మతుడంటే చెప్పలేనంత మక్కువ .
అందరి దేవుళ్ళను సమాదరించే నీకు నీళ్లలో పడ్డప్పుడు
చేయందించలేదు ఎందుకు ?
అమ్మానాన్నలంటే శ్రవణకుమారుడంతటి ప్రేమ
ఓటి గుండె అయిన అమ్మకు నడవలేని నాన్నకు
చేతికర్రలాగా తోడుంటూ కళ్ళల్లో పెట్టుకుని చూసే నీకు
ఎందుకు గుర్తుకు రాలేదు.
సుజాతకు నీవే లోకం మీ పిల్లలను నిన్ను తప్ప ఈ లోక
స్వార్థం లేనిది.
నీ కనిష్ఠ కూతురును కలెక్టర్ చేయాలనే కలలు,
ఎందుకో కలిపావు నీటి అలలపై.
మీ అక్కంటే ఎక్కడలేని ప్రేమ
ఆపదైన సాపదైన చెప్పకుంటే ఓదార్చేదే కదమ్మా.
వీరన్న మామైనా, కేశన్నైనా నీకు అమితమైన గౌరవం
ఎందుకో నీవు చేసిన పనితో అందరికీ పరాభవం.
ఎవరెవరికో చేయందిన వీరు
తీర్చ లేక పోదురా నీ బేజారు.
అన్ని ఆటలల్లో విజేతవైన నిన్ను
ఎలాగైనా ఓడించాలని,
మృత్యు కేళిలో ఓడించింది.
నీ బాధను మాబాధగా స్మరించు కుంటూ
మేమిచ్చు అక్షర నీరాజనం

**మీ గుజ్జ వెంకటేశం**
**ఉపాధ్యాయుడు**

## రాంకీ విల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా విష్ణుకాబ్రా

### ప్రధాన కార్యదర్శిగా బేతి అశోక్ బాబు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని ప్రతిష్టాత్మక రాంకీ విల్లా ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. విల్లా ప్రాంగణంలోని దేవాలయంలో ఉదయం 9 గంటలకు భక్తిశ్రద్ధల మధ్య నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా విష్ణుకాబ్రా, ప్రధాన కార్యదర్శిగా బేతి అశోక్ బాబు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా విష్ణుకాబ్రా, ఉపాధ్యక్షులు కనుకుంట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బేతి అశోక్ బాబు, జాయింట్ సెక్రటరీ బలభద్ర రాము, కోశాధికారి హనుమంతరావులు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి బేతి అశోక్ బాబు మాట్లాడుతూ, అసోసియేషన్ అభివృద్ధి కోసం పారదర్శకమైన వ్యవస్థను రూపొందిస్తామని హామీ ఇచ్చారు. విల్లా వాసుల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల మెరుగుదల, సభ్యులందరి మధ్య సౌహార్ద వాతావరణం పెంపొందించడమే తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులు అసోసియేషన్ రాజ్యాంగం, నిబంధనలకు కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ వేడుకలో విల్లా పెద్దలు, నివాసితులు సంపత్ రావు, పెంచలయ్య, అజయ్ రఘువీర్, పూర్ణ చందర్, సదానందం, శ్రీనివాస్, సోమ వేణు, బేతి రాజు తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఆశీర్వదించారు.

## సంస్థ అభివృద్ధిలో కార్మికులే వెన్నెముక

### వైస్ ప్రెసిడెంట్ కేఎస్ఎన్ మూర్తి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలంలోని తాడిచర్ల ఓపెన్ కాస్ట్ మైన్ సరికొత్త రికార్డును సృష్టించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించుకున్న 25 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకుంది. ఈ చారిత్రాత్మక విజయం పట్ల ఏఎమ్మార్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, సంస్థ ఉద్యోగులు, కార్మికులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. లక్ష్యాన్ని చేరుకున్న శుభసందర్భంగా గురువారం మైన్ ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. సంస్థ వైస్ ప్రెసిడెంట్ కేఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులకు స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు. మైన్ మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ సురేష్ బాబు, హెచ్ ఆర్ డీజీఎం రమేష్ బాబు, సర్వే డీజీఎం సరోత్తం, మెకానికల్ విభాగం నుంచి కిషన్, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ పూల్ ఘటనపై 'సీపీ' సీరియస్

- తల్లి, ఇద్దరు కుమార్తెల మృతిపై క్షేత్రస్థాయిలో విచారణ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్
- శాస్త్రీయ కోణంలో దర్యాప్తు చేయాలని ఆదేశం

**వరంగల్ వాయిస్, పున్నేలు/ఐనవోలు :** ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు కుమార్తెలు స్విమ్మింగ్ పూల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఉమ్మడి జిల్లాలో కలకలం రేపింది. ఈ విషాదకర ఘటనను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ అత్యంత తీవ్రంగా పరిగణించారు. గురువారం ఆయన స్వయంగా ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఘటనా స్థలంలో పరిసరాలను నిశితంగా పరిశీలించారు. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కేసు దర్యాప్తు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మరణాలకు గల కారణాలపై ప్రాథమిక ఆధారాలను సేకరించాలని, అసలు ఏం జరిగిందనే కోణంలో లోతైన విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. అనుమానాస్పద మృతిగా నమోదైన ఈ కేసులో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతుల్లో విచారణ పూర్తి చేయాలని సీపీ స్పష్టం చేశారు.

## పోలీస్ జిమ్ సెంటర్ ను సందర్శించిన సీపీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పోలీస్ జిమ్ సెంటర్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ గురువారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిమ్ సెంటర్ లో ఏర్పాటు చేసిన వ్యాయమ సామగ్రిని పరిశీలించారు. అలాగే పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకై ఏర్పాటు చేయాల్సిన జిమ్ సామగ్రిపై పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులతో చర్చించారు. పోలీస్ కమిషనర్ వెంట అదనపు డీసీపీతో పాటు ఏసీపీ, ఆర్ఐలు ఉన్నారు.

## బహుజన రాజ్య స్థాపకుడు సర్వాయి పాపన్న గౌడ్

- జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి
- పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పీడితులు, బహుజనులు ఐక్యంగా పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్య వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి కొనియాడారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాటి భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి, తెలంగాణ గడ్డపై దళిత, బహుజన, మైనారిటీ వర్గాలను ఏకం చేసి ప్రజారాజ్యాన్ని నిర్మించిన ఘనత పాపన్న గౌడ్‌కే దక్కుతుందని అన్నారు. అంతకుముందు, జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి, డీఆర్ఓ సత్యపాల్ రెడ్డి కలిసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, గౌడ సంఘం ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సమరయోధుడు సర్వాయి పాపన్న గౌడ్

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కలెక్టరేట్‌లో పాపన్న గౌడ్ కు ఘన నివాళి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బహుజన వీరుడు, సామాజిక సమానత్వం కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కొనియాడారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నాటి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న వర్గాల కోసం పాపన్న చేసిన పోరాటం మరువలేనిదని అన్నారు. ఈ నివాళులర్పించిన వారిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పుష్పలత ఉన్నారు. అలాగే గౌడ సంఘం ప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

## భారీగా గుట్కా పట్టివేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ క్రైమ్:** హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు భారీ ఎత్తున నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. టైలర్ స్ట్రీట్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహం సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ. 4.70 లక్షల విలువైన గుట్కా, పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు హనుమకొండ ఎస్సై కిషోర్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది మహిపాల్, తిరువర్ధన్‌లతో కలిసి స్థానిక శివం కిరాణా స్టోర్‌పై గురువారం మెరుపు దాడి నిర్వహించారు. ఈ సోదాల్లో భారీ మొత్తంలో నిల్వ ఉంచిన నిషేధిత ఉత్పత్తులు బయటపడ్డాయి. వీటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితుడు రాజ్‌పుత్ చేతన్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు రాజ్‌పుత్ చేతన్ ఈ నిషేధిత ఉత్పత్తులను ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా తెప్పించి, ఇక్కడ పలు చిన్న చిన్న షాపుల వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. నిందితుడిపై కేసు నమోదు చేసి, ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై కిషోర్, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి కల్యాణం



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని మల్లక్కపేట గ్రామంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం ఆంజనేయ స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంభీరు మహేందర్ ఆధ్వర్యంలో అర్చకులు జగన్నాథ ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే పూజలు ప్రారంభమై అనంతరం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా హాజరై స్వామివారి దర్శనం చేసుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం హనుమాన్ భజనలతో మార్మోగింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com